# అవసరాల కోసమే చోరీలు

**- ఫస్ట్‌టైం పట్టుబడిన వారంతా ఆర్థికసమస్యలతోనే దొంగతనాలు**
**- విచారణలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి**
**- మరొకరు తండ్రి అప్పు తీర్చేందుకు**



**హైదరాబాద్, జూన్7, ప్రభాతవార్త:** తలకుమించిన భారం, తట్టుకోలేని బాధలు, ఆలోచన లేని టెన్షన్లు..దారి తెలియని కుటుంబ సమస్యలు ఒంటరి అనేఫీలింగ్‌తో అప్పులు కూడా దొరకకపోవడంతో పరువు, విలువలను తాకట్టు పెట్టి 'ఒక్కసారే చేసి మానేయాలి' అనుకొని దొంగతనాలను పాల్పడుతూ పోలీసులకు అడ్డంగా దొరికిపోతున్నారు. ఇలా ఎందరో ఫస్ట్‌టైం నేరాలు బాటపట్టి నేరస్తుడిగా ముద్ర వేసుకుంటున్నారు. ఉన్నత విద్యనభ్యసించి కూడా దొంగగా మారుతున్నారు. ఈజీ మని కోసం కొందరు ఉంటే కుటుంబ బాధలు, అప్పులలొల్లి, చదువు కోసం.. ఒక్కొక్కరు ఒక్కో కారణాలతో చెడుకు మొగ్గుచూపుతున్నారు. ఫస్ట్‌టైం దొంగతనాల ఘటనలో ఆర్థికమాంధ్యాలతోనే ఈ పని చేశాం..మళ్లీ చేయం అంటూ బతిమిలాడడం నిందింతుల వంతైంది. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత నాలుగునెలల్లో సుమారు రెండొందల దొంగతనాలు జరిగితే విచారణలో నలభైమంది ఫస్ట్‌టైం చేసిన వారే ఉన్నట్లు వెల్లడైంది. గత రెండు నెలల క్రితం బీటెక్ చేసిన ఓ విద్యార్థి చెల్లి పెళ్లి కోసం దొంగతనానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఇటీవల మరొకరు తండ్రి చేసిన అప్పు తీర్చడం కోసం, ఇంకొకరు కొత్త వాహనం కోసం ఫస్ట్‌టైం దొంగతనం చేశానని అంగీకరించాడు. ఇలా ఎన్నో ఘటనలు ఉన్నాయి.

**అవసరానికే నేరాలు...**

ఫస్ట్‌టైం దొంగతనాల బాట పట్టినవారంతా ఏదో ఒక అత్యవసరం లేకపోలేదు. అప్పులు దొరకగా, తీసుకున్న డబ్బులు తీర్చాలనే వేధన మానసికంగా కృంగదీస్తున్నాయి. దీంతో చేసేది ఏమి లేక దొంగతనాలను ఎంచుకుంటున్నారు కొందరు యువత. సరైన జాబ్ లేకపోవడంతో జీతం తక్కువగా ఉండడంతో టెన్షన్లను తట్టుకోలేక దొంగలుగా మారుతున్నారు. ఆస్తులు లేకపోవడం, తల్లిదండ్రులు భరోసా కల్పించలేకపోవడం, చిన్నపాటి ఖర్చులకు సతమతవడంలాంటి కారణాలతో తప్పులు చేసి ఊచలు లెక్కిస్తున్నారు. హాస్టళ్లలో ఖరీదైన ఫోన్లు, వాచీలు దొంగిలించడంతో పాటు రోడ్లపైన వాహనాలను ఎత్తుకపోవడం, మాస్క్‌లు ధరించి యువతులు, మహిళల హ్యాండ్ బ్యాగులు, చైన్‌స్నాచింగ్‌లు వంటి పనులు చేస్తున్నారు. అక్కడక్కడ మరికొందరు జల్సాలు, ప్రియురాలికి ఖర్చుపెట్టడం కోసం అని కూడా పోలీసుల విచారణలో చెబుతున్నారు. అంతేకాకుండా ప్రొఫెషనల్‌గా ఒక పథకం ప్రకారం కాకుండా పోలీసులకు దొరుతామనే భయం లేకుండా భద్రత, జాగ్రత్తలు పాటించకుండా అప్పటికప్పుడు కనిపించింది కొట్టేయడమే చేస్తున్నారు. దీంతో బాధితుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి క్లూస్‌టీం, టెక్నాలజీతో దొంగలను గుర్తిస్తున్నారు. సీసీఫుటేజ్‌ల ఆధారంగా ఈజీగా దొరికిపోయి కేసులకు భయపడుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులు సైతం మందలించడంతో బాధలతో కృంగిపోయి అవమానంగా భావించి ఆత్మహత్యల ప్రయత్నాలు చేస్తున్నారు.

**తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి...**

పిల్లలు ఏం చేస్తున్నారని, బాగోగులు చూస్తు వారానికి రెండుసార్లు అయిన ఫోన్‌లు చేయాలని విశ్లేషకులు చెబుతున్నారు. టీనేజ్ వయస్సులో ఆశ కలగడం సాధారణమే. పక్కవారిని చూసి మనకు కావాలని మనస్సులో కోరికలతో దొంగతనాలకు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా మనీ సమస్యలు, ఆరోగ్యంపై పర్యవేక్షించాలని సూచిస్తున్నారు. తప్పుదారిలో వెళ్లకుండా భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. ఏదైన తప్పులు చేస్తే తీవ్రంగా మందలించకుండా సామరస్యంగా పరువు, ప్రతిష్టలపై పిల్లలకు తెలియజేయాలని అభిప్రాయపడుతున్నారు. ఆర్థికంగా సమస్యలుంటే తలిదండ్రులు బాధ్యత తీసుకొని కుటుంబసభ్యులందరూ ఒక్క చోట కూర్చుకొని చర్చించడంతో పరిష్కారమవుతాయని సామాజికవేత్తలు పేర్కొంటున్నారు. కేసులు, శిక్షలపై కూడా వివరించాలని, భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తలెత్తేవకాశం ఉంటుందని వివరించాలన్నారు. పార్ట్‌టైం జాబ్‌లు చేసేలా ప్రోత్సాహించి పాకెట్ మనీ సంపాదించుకునేలా మనమే అవకాశాలను కల్పించాలని తెలియజేస్తున్నారు.

# దీపాలంకరణతో కాచిగూడ రైల్వే స్టేషన్

**-9న కాచిగూడ రైల్వే స్టేషన్ ముఖద్వార విద్యుత్ దీపాలంకరణను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



విద్యుత్ దీపాలంకరణతో ఆకట్టుకుంటున్న కాచిగూడ రైల్వే స్టేషన్ (ఫైల్)

**తార్నాక, జూన్ 7 ప్రభాతవార్త :** చారిత్రాత్మక కాచిగూడ రైల్వే స్టేషన్ ముఖ ద్వార విద్యుత్ దీపాలంకరణను ఈ నెల 9న జాతికి అంకితం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అంకితం చేయనున్నట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులతో పాటు మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, ఇతర సీనియర్ రైల్వే అధికారులు కూడా హాజరవుతారు. నగరంలోని ఎక్కువ మంది రైలు వినియోగదారులకు సేవలను అందిస్తున్న కాచిగూడ రైల్వే స్టేషన్ హైదరాబాద్ జంట నగరాల్లోని ప్రధాన టెర్మినల్స్‌లో ఒకటి. ఇది హైదరాబాద్ డివిజన్‌లోని ఒక ముఖ్యమైన స్టేషన్ మరియు 5 ప్లాట్‌ఫారమ్‌లను కలిగి ఉంది. ఇందులో ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలు కల్పించబడ్డాయి. ఈ స్టేషన్ రోజుకు సగటున 103 రైళ్లు మరియు సగటున 45,000 మంది ప్రయాణికులకు సేవలను అందిస్తూ ఇప్పటివరకు లక్షలాది మంది రైలు వినియోగదారులకు ఉత్తమ అనుభవాన్ని అందించడంలో 100 కంటే ఎక్కువ ఫలప్రధమైన సంవత్సరాలను పూర్తి చేసుకుంది. పర్యాటక అనుకూల కార్యక్రమాలలో భాగంగా, కాచిగూడ రైల్వే స్టేషన్ ముఖద్వారాన్ని విద్యుత్ దీపాలంకరణను రూ. 2.23 కోట్ల అంచనా వ్యయంతో ప్రకాశవంతం చేయాలనే ప్రతిపాదనను పర్యాటక మంత్రిత్వ శాఖ ఆమోదించగా సదరు పనిని దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్ డివిజన్ అమలుచేసింది. ఈ అలంకరణలో వివిధ రంగుల నేపధ్యాలను ఉపయోగించి దీపాలను అలంకరించడం వలన స్థానిక, జాతీయ, అంతర్జాతీయ సందర్భాలు కార్యక్రమాల ఉత్సాహం పెరుగుతుంది. ఇది ప్రయాణీకులకు, ప్రజలకు, పర్యాటకులకు రాత్రిపూట దృశ్యమానమైన వాతావరణాన్ని అందించనుంది. ఈ అలంకరణలో విద్యుత్ పరికరాలు అవుట్‌డోర్ టైప్ ఆర్.జి.బి., ఎల్.ఈ.డి, ఐ.పి 66 వంటి తాజా ఆధునిక పరికరాలతో తయారు చేయబడ్డాయి. అందువలన ఇవి వివిధ లైటింగ్ పథకాలకు అనువైన 512 డి.ఎం.ఎక్స్ కంట్రోల్ సిస్టమ్ సెకండరీ ఆప్టిక్స్‌కు మద్దతు ఇచ్చే అంతర్నిర్మిత డి.ఎం.ఎక్స్ డీకోడర్‌తో ఐ. పి 66 రేట్ చేయబడ్డాయి. మొత్తం వ్యవస్థ యొక్క రక్షణ, భద్రత మరియు శక్తి సామర్థంపై కీలక దృష్టితో స్టేషన్ యొక్క వారసత్వ నిర్మాణాన్ని మెరుగైన ప్రకాశంతో అలంకరించడం ఈ విద్యుత్ దీపాలంకరణ లక్ష్యం అని అధికారులు పేర్కొన్నారు.

# విద్యుత్ స్థంబాలు ఉండవ్..!

**-గ్రేటర్‌లో భూగర్భ విద్యుత్ లైన్లు**
**-సెక్షన్ల వారీగా సర్వే చేస్తున్న అధికారులు**
**-తొలుత ప్రధాన రోడ్లు ఆతర్వాత కాలనీలు**
**-ఆగస్టు నుంచి పనులు మొదలుపెట్టేలా చర్యలు**



**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రధాన రహదారులు, వీధుల్లో వేలాడుతున్న ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను తొలగించి, వాటిస్థానంలో భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు సెక్షన్ల వారీగా ఉన్న సబ్ స్టేషన్లలోని ఫీడర్ల వారీగా వివరాలను సేకరిస్తోంది. ఒక్కో సెక్షన్కు రూ. వంద కోట్ల చొప్పున.. గ్రేటర్ వ్యాప్తంగా రూ.22 వేల కోట్లకుపైగా అవసరం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసింది. మెట్రోజోన్ పరిధిలోని హైదరా బాద్ సెంట్రల్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్లలో డిస్ట్రిబ్యూషన్ లైన్లు మినహా 33/11 కేవీ లైన్ల పనులు దాదాపు పూర్తయ్యాయి. మేడ్చల్ (హబ్సిగూడ, మేడ్చల్ సర్కిల్), రంగారెడ్డి (సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్ నగర్) జోన్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇప్పటికీ ఓహెచ్ (ఓవర్ హెడ్‌లైన్లు) కనిపిస్తున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి తరచూ తెగిపడుతూ.. అటుగా వచ్చి వెళ్లేవారిపై పడి అమాయక ప్రజల మృత్యువాతకు కారణమవుతున్నాయి. దీంతో ఇటీవలే డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం బెంగళూరులో పర్యటించి, భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను పరిశీలించింది.

**గ్రేటర్‌లో 60లక్షల విద్యుత్ కనెక్షన్లు..**

గ్రేటర్లో ప్రస్తుతం 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 52 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు రోజు సగటు విద్యుత్ డిమాండ్ 85 మిలియన్ యూనిట్లకు పైగా నమోదైంది. అదే సాధారణ రోజుల్లో 60 ఎంయూలకు తగ్గడం లేదు. పాత బస్తీ సహా ప్రధాన కాలనీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. లైన్ల కింద అనేక చోట్ల భారీ భవనాలు వెలిశాయి. ఇంటిపై దుస్తులను ఆరవేసేందుకు వెళ్లిన మహిళలు, గాలి పటాలను ఎగరేసేందుకు వెళ్లిన పిల్లలు ఓవర్‌హెడ్ లైన్లను అనుకుని కరెంట్ షాక్‌తో మృతి చెందుతున్న ఘటనలూ తరచూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఓవర్‌హెడ్ లైన్ల స్థానంలో యూజీ కేబుళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రమాదాలను నివారించి, సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరచవచ్చని డిస్కం భావిస్తోంది. దీనిలో భాగంగానే. సర్కిళ్ల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యులను నియమించింది. తొలి దశలో ప్రధాన మార్గాల్లో ఉన్న సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ఓహెచ్ లైన్లు, డీటీఆర్‌లు, విద్యుత్ స్తంభాలను గుర్తిస్తున్నారు. ఆతర్వాత బస్తీలు/కాలనీల్లో లైన్లను గుర్తించి, అంచనాలు రూపొందించనున్నారు. అన్ని సవ్యంగా జరిగితే ఆగస్టు చివరిలో పనులు ప్రారంభించే అవకాశం ఉంది.



# హైదరాబాద్ వార్త

# భక్తిశ్రద్ధలతో బక్రీద్

**-పాతనగరంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు**





**చార్మినార్, జూన్ 7 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో ముస్లింలు బక్రీద్ పండుగను అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. బక్రీద్ పండుగ సందర్బంగా దక్షిణ మండలం పోలీసులు పాతనగరంలోని అన్ని ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. చారిత్రక మక్కా మసీదు, బహదూర్‌పుర శివారులో ఉన్న చారిత్రక మీరాలం ఈద్గాతో పాటు పాతనగరంలోని పలు ప్రాంతాలలో ఉన్న మసీదులు, ఈద్గాలలో శనివారం ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్దలతో ప్రార్దనలు జరిపారు. మక్కామసీదు, చారిత్రక మీరాలం ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్దనలో పాతబస్తీకి చెందిన వేలాది మంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు. బక్రీద్ సందర్బంగా ముస్లింలు పెద్ద ఎత్తున గొర్రెలు, పొటేళ్లను కొనుగోలు చేశారు. పాతబస్తీలోని ఏ ప్రాంతంలో చూసిన బక్రీద్ వాతావరణం కనిపించింది. ముస్లింలు ఒకరికి ఒకరూ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మక్కామసీదు, మీరాలం ఈద్గాలో జరిగిన ప్రార్దనలలో ముస్లిం మత ప్రముఖులు, ఎంఐఎం ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని చార్మినార్, మొగల్‌పుర, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, బార్కస్, రెయిన్‌బజార్, కామాటిపుర, కాలాపత్తర్, హుస్సేనీఆలం, మీరాలంమండి, దారుషిఫా, ఎత్తెబార్‌చౌక్, శాలిబండ, జహనుమా, కిషన్‌బాగ్, మొగల్‌పుర, డబీర్‌పుర, కాజీపుర, ఫత్తెదర్వాజ, బిలాల్‌నగర్, షంషేర్‌గంజ్ ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. చారిత్రక మీరాలం వద్ద ట్రాఫిక్ డిఐజి జోయల్ డేవిస్, దక్షిణ మండలం డిసిపి స్నేహా మెహ్రా, డిసిపిలు రక్షిత, అపూర్వ శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

## 'సిఐఎస్‌ఎఫ్' పాసింగ్ అవుట్ పరేడ్

**-ఉత్సాహంగా కుటుంసభ్యులతో సందడి**





**హైదరాబాద్, జూన్7, ప్రభాతవార్త :** పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన 'సిఐఎస్‌ఎఫ్' ఎస్సైల శిక్షణ ముగిసింది. ఈ మేరకు శనివారం హాకీంపేట గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి సీఐఎస్ ఎఫ్ డీజీ నీలిమ రాణిసింగ్ ముఖ్యఅతిధిగా హాజరై గౌరవవందనం చేశారు. ఎస్సైలుగా తమవారిని చూసి కుటుంబ సభ్యులు మురిసిపోయారు. ఫోటోలు, సెల్ఫీలతో కొత్త ఎస్సైలు సందడి చేశారు.

## నవరసభరితం చిన్నారుల నృత్యవైభవం



నృత్యవైభవంలో ఒక దృశ్యం

**నాంపల్లి, జూన్ 7 ప్రభాతవార్త :** పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న చందంగా ఉషణా స్కూల్ ఆఫ్ డాన్స్ ప్రథమ సంవత్సర వార్షికోత్సవం వేడుకల్లో సంవత్సరకాలంలోనే నృత్యకళలో నిష్ణాతులుగా తీర్చిదిద్దిన చిన్నారులు తమ అద్భుత నాట్యచతుర్యంలో నవరసభరితంగా నర్తించి ఆహుతుల ప్రశంసలందుకున్నారు. సంస్థ ప్రఖ్యాత నృత్యగురువు యశస్విశ్రీ శిష్యరికంలో చిన్నారులు తమ సృజనాత్మకత, ప్రతిభాపాటవాలను ప్రదర్శించి ఔరా అనిపించారు. ఈనాటి నృత్యవైభవంలో చిన్నారులు ముందుగా రాగమాలికరాగంలో సభవందనంతో ప్రారంభించి మహాగణపతిమ్; జతిస్వరం, రామాయణశబ్దం, జయజయ రామనాథ, లింగాష్టకం, వినరోభాగ్యము విష్ణుకథ, పలుకే బంగారమాయేనా, ఎహిమధమ్ తదితర పలు అంశాలను ఎంతో శృతి లయబద్ధంగా, హావభావాలను ప్రదర్శిస్తూ విచ్చేసి ప్రేక్షకులను మైమరింపి మంత్రముగ్ధులను చేసి శుభాశీస్సులందుకున్నారు. వాద్యసహకారంలో సంజనా గాత్రం, గాడె యశస్విశ్రీ నట్టువాంగం, కొలిపాక వీరస్వామి మృదంగం, దోళ ధనుంజయరావు వయోలిన్‌తో అద్భుతంగా అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. చివరిగా నృత్యవైభవంలో ప్రదర్శనలిచ్చిన చిన్నారులను ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను బహూకరించి శుభాభినందనలు, సంస్థను, గురువు యశస్విశ్రీని ఎంతగానో అభినందించారు.

## విజయవంతంగా ముగిసిన టిటిడి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు



రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులకు శ్రీవారి జ్ఞాపికను బహుకరిస్తున్న త్రినాథబాబు

**సైఫాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి బాలాజీభవన్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ప్రతి రోజు జరిగే పూజా కార్యక్రమాలతోపాటు శనివారంనాడు అదనంగా శ్రీవారికి ఉదయం 8 గంటలకు మహా పూర్ణాహుతి, పదిన్నరకు చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు పుష్ప యాగం అత్యంత వైభవంగా కన్నుల పండువలాగా జరిగాయి. రాత్రి 9 గంటలకు జరిగిన ధ్వజావరోహణం కార్య క్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ నెల 2వ తేదీన అంకురార్పణంతో ఈ బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు దేవాలయంలో శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు జరిపారు. దేవాలయం అర్చకులు భక్తులకు తీర్థప్రసాధాలతోపాటు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్న ప్రసాద వితరణ గావించారు. ఈబ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర రావాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ దంపతులు, హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్ దంపతులు పాల్గొని ప్రత్యేకంగా శ్రీవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వారికి వేదపండితులు అశ్వీసులు అందజేశారు. బ్రహ్మోత్సవాల డోనర్ త్రినాథ్‌బాబు మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు, ఎం.అనిల్ కుమార్‌యాదవ్ దంపతులు, మహాలక్ష్మిరామన్‌గౌడ్ దంపతులను ఘనంగా సత్కరించి శ్రీవారి జ్ఞాపికలను బహుకరించారు. 6 రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో టిటిడి ఎఇవో యు.రమేష్, టిటిడి ప్రతినిధులు శ్రీనివాస్‌ప్రభు, శ్రీనివాసమణికంఠ, నిరజా, లక్ష్మీపతి, టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి, హరినాథ్, శ్రీవారి సేవకులు, త్రినాథ్‌బాబు సేవకులు, బాలాజీ భవన్ భక్తుల సొసైటీ అధ్యక్షుడు ఎం.కృష్ణంరాజు, సభ్యుడు వాసు, దేవాల యం ఉద్యోగులు, సిబ్బంది వందలాది మంది వేలాది మంది భక్తులకు విశేషమైన సేవలు అందించారు. వేదిక కార్యక్రమాలు టి.కృష్ణామాచార్య కంకణబట్టర్ ఆధ్వర్యంలో అర్చకులు అజయ్‌స్వామి, శ్రావణకు మార్‌స్వామి, వేద పండితులు, అర్చకులు నిర్వహించారు.

## ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి : కార్పొరేటర్ జితేందర్‌నాథ్



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, జూన్ 7 ప్రభాతవార్త:** ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళుతున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని సెయింట్ పాయిస్ పాఠశాల నుంచి అల్వాల్ హిల్స్, పల్లవి పాఠశాల, పంచ్‌షీల్ ఎన్‌క్లేవ్, వజ్రా ఎన్‌క్లేవ్, చేతన ఎన్‌క్లేవ్ వరకు 30లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. సిసి రోడ్డు ఏర్పాటు ద్వారా పలు కాలనీ వాసులు ఇబ్బందులు తొలగనున్నాయని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, మల్లిఖార్జున్, శ్రీనివాస్, ఉదయ్ కుమార్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీనివాసుని కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**అల్వాల్, జూన్ 7 ప్రభాతవార్త:** అల్వాల్ హిల్స్‌లోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం 7వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలులో పాలు పంచుకున్నారు. మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ ఉత్సవాలులో పాల్గొన్ని స్వామి దర్శనం చేసుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడం జరిగింది.

### భారత్,చైనాల మధ్య వైద్య సంబంధాలు మరింత బలోపేతం



**అఫ్జల్‌గంజ్,జూన్ 7 ప్రభాతవార్త:** భారత్ చైనాల మధ్య వైద్య సంబంధాలు మరింత బలోపేతం అయ్యే దిశగా కృషి చేసే లక్ష్యంతో 11మందితో కూడిన భారతీయ వైద్య బృందం చైనా బయలు దేరింది. భారత్ చైనా మిత్ర మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌రెడ్డి నాయకత్వానా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ దూపూర్ ద్వారకనాథ రెడ్డి తదితరులతో కూడిన వైద్య మిత్రబృందం బయలు దేరి వెళ్లింది. ఈనెల 9వ తేది నుంచి 15వ తేది వరకు చైనాలో నిర్వహించ బోయేభారత చైనా 7వ సంయుక్త వైద్య బృందం వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్లినట్లు చెప్పారు. డాక్టర్‌పి. విరావు,డాక్టర్ జతిన్‌కుమార్,రాకేష్‌రెడ్డి,సాయిసుధాకర్‌లు బృందంలో ఉన్నారు. మధ్యమైత్రి అవగాహనపెంపొందించాలనే దృక్పథంతో పర్యటనలు కొనసాగిస్తున్నాయి. ఇప్పటి వరకు ఆరు బృందాలు ఇరు దేశాల్లో పరస్పర పర్యటనలు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా వైద్య రంగ అభివృద్ధిని అధ్యయనం చేయడం చైనా,వైద్య విధానాలు తెలుసుకోవడం,ఇరు దేశాల మంచి వైద్య పరిజ్ఞానాన్ని పంచుకోవడం,వైద్యసంస్థల మధ్య అవగాహన పెంచడం,ప్రజల మధ్య స్నేహ సౌహార్దాన్ని బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. ఈసమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అక్రమాలకు పాల్పడ్డ కేశవులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డా. రాజేష్‌నాయక్

**సైఫాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** గత దశాబ్ధకాలంగా రాష్ట్ర సీడ్ సర్టిఫికేషన్ అథారిటి డైరెక్టర్ పదవిలో అక్రమంగా కొనసాగుతూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్న డా. కేశవులపై సమగ్ర విచారణ జరిపి వెంటనే పదవి నుంచి తొలగించాలని గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈమేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి ఛైర్మన్ డా. రాజేష్‌నాయక్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే ఓఈసిడి అంతర్జాతీయ సదస్సు నుంచి అతన్ని తొలగించాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని మంత్రులకు లక్షల కొద్ది ఆయన డబ్బులు ముట్టజెప్పి అక్రమంగా పదవుల్లో కొనసాగుతున్నారని ఆరోపించారు. ఆతని అవినీతి, అక్రమాలు తెలుసుకున్న సిఎం రేవంత్‌రెడ్డి కేశవులను సీడ్ ఎండి పదవి నుంచి తొలగించిన తరువాత కూడా ఆతను ఓఈసిడి డైరెక్టర్‌గా కొనసాగుతున్నారని, ఈ సంస్థ తరుపున 20 దేశాలలో తిరిగి ప్రభుత్వ ధనాన్ని వృధాగా ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. అతని అవినీతిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్,అగ్రికల్చర్ యూనివర్సిటి విసిని కలిసి ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.




## సాహితీసేవా తత్పరులు డాక్టర్ వాసా ప్రభావతి : కెవి.రమణాచారి



ఆచార్య అనుమాండ్ల భూమయ్య, ఆచార్య సూర్యా ధనంజయ్‌లకు పురస్కారాలను ప్రదానం చేస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి

**చిక్కడపల్లి, జూన్ 7 ప్రభాతవార్త:** సాహితీసేవా తత్పరులు డాక్టర్ వాసా ప్రభావతి అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో వాసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ వాసా ప్రభావతిశాస్త్రి జయంతి సందర్భంగా ప్రముఖ పద్యకవి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీ పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య అనుమాండ్ల భూమయ్యకు 'డాక్టర్ వాసా ప్రభావతి జీవత సాఫల్య ప్రతిభా పురస్కారం' అదే విధంగా ప్రముఖ విద్యావేత్త వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య సూర్యా ధనంజయ్ 'డాక్టర్ వాసా ప్రభావతి గురుదేవో భవ గురు పురస్కారం' ప్రదానం చేసే కార్యక్రమం ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.వి.రమణాచారి పురస్కారాలను అందించి ప్రసంగించారు. మహిళల కోసం ప్రత్యేకంగా 'లేఖిని' మహిళా చైతన్య సాహితీ సంస్థ ద్వారా సాహితీ సేవ చేశారని, ఎందరో వర్ధమాన కవయిత్రులకు మార్గనిర్దేశనం చేశారన్నారు. అటువంటి రచయిత్రులను ప్రోత్సహిస్తూ ప్రతి ఏడాది 'మాతృదేవోభవ' పేరుతో పురస్కారాలను అందించే గొప్ప సంస్కారాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి శైలజామిత్ర, పాలపిట్ట సంపాదకుడు గుడిపాటి వెంకటేశ్వర్లు, సాహితీకిరణ్ సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, వాసాప్రభావతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వాసా ప్రకాశ్, మీనాక్షి, నిర్వాహకులు మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ వాసా ప్రభావతి స్మారక కవిత, కథల పోటీల విజేతలకు కూడా బహుమతులు అందించి గౌరవించారు. ఈ సందర్భంగా స్వరకిన్నెర నిర్వహణలో కూచిపూడి నృత్య ప్రదర్శనను వాసవీ చౌదరి, ఎన్.రమ్యవేణి, ఆశ్రిత షిండే, సహస్ర ప్రదర్శన అందరిని అలరించింది.

## మావోయిస్టులను తక్షణమే కోర్టులో హాజరుపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

**సైఫాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** బీజాపూర్ పోలీసుల నిర్బంధంలో ఉన్న మావోయిస్టులను తక్షణమే కోర్టులో హాజరుపరచాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు డిమాండ్ చేశారు. పది మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం ఉందని, అందులో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారా ఆడేళ్ళు అలియాస్ భాస్కర్ వంటి ప్రకాష్, నేషనల్ పార్క్ కార్యదర్శి మధ్య డి ఏరియా కార్యదర్శి సీటు రామన్న డిసి మెంబర్ మున్న సునీత మహేష్‌లతోపాటు పది మంది మావోయిస్టులను పోలీసులు ప్రాణాలతో అదువులోకి తీసుకున్నారని ఆరోపించారు. అయితే వారి అరెస్టును చూపించకుండా 5వ తేదీన సుదాకర్‌ను కాల్చిచంపారని, 6వ తేదీన మైలారపు ఆడేలును కాల్చిచంపారని, ఇక మిగిలినవారిని కోర్టులో హాజరుపరాచాలని వారు డిమాండ్ చేశారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక హక్కులు, పౌర హక్కులు పూర్తిగా ప్రమాదంలో పడ్డాయని, అందులో భాగంగా రోజుకొకరిని కాల్చిచంపడమే ఇందుకు నిదర్శనమని, మనందరం ఈ విధానాన్ని వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రాజారాం, పి.ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ పిఎస్‌లో విచారణకు హాజరైన మన్నె క్రిశాంక్



**అత్తాపూర్ జూన్7,ప్రభాతవార్త :** మిస్ వరల్డ్ పోటిలలో మిస్ ఇంగ్లాండ్‌పై కాంగ్రెస్ నాయకులు అసభ్యకరంగా ప్రవర్తించారని పలు కథనాలు ఇంగ్లాండ్ వార్త సంస్థలు ప్రచురించాయని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ పత్రికా ప్రకటనలను తన ట్వీటర్‌లో ట్వీట్ చేశారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు ఫహీం ఖురేషి ఫిర్యాదు చేయడంతో రాజేంద్రనగర్ పోలీసులు బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ కు నోటిసులు జారి చేయడంతో శనివారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు లీగల్ సెల్ సభ్యులతో కలిసి మన్నె క్రిశాంక్ వచ్చి వివరణ ఇచ్చారు.

**పత్రిక కథనాలపై విచారణ జరపాలి**

**-ప్రభుత్వ ఒత్తిడితోనే విచారణకు పలిచారు**

**-పోలీసులకు సహకరిస్తా : మన్నే క్రిశాంత్**

రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్‌లో విచారణ అనంతరం బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ మిడియాతో మాట్లాడుతూ...మిస్ ఇంగ్లాడ్ పై కొందరు వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించారని తనని వేశ్యగా చూశారని ఇంగ్లాండ్ మిస్స్ ఇండియా మీడియాలలో తెలిపిందని పలు పత్రికలలో ఈ కథనాలు ప్రచురమయ్యాయని వాటినే నేను ట్విట్ చేయడం జరిగిందని కొత్త చేసిందేమి లేదని తెలిపారు. ఈ కథనాలపై విచారణ జరపాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలనీ ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం పరువు పోతుందన్న ఉద్దేశంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం జరిగిందని మిస్ ఇంగ్లాండ్ కామెంట్స్ పై ప్రభుత్వం స్పందించలేదు కానీ నేను పెట్టిన పోస్ట్ పై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అక్రమ కేసులు పెట్టిందన్నారు. కంప్లైంట్ చేసిన రాజేంద్రనగర్‌కి చెందిన ఫహీం ఖురేషి ఒక్కప్పుడు కెబుల్ ఆపరేటర్ అన్ని ఇప్పుడు ఏకంగా సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు అన్ని కొన్ని కోట్ల ఎదిగాడని అన్నారు. అన్ని కొట్లు ఎక్కడి నుంచి వచ్చాయే చెప్పాలన్నారు. ఫహిం ఖురేష్ సిఎం సన్నిహితుడు కాబ్బటే ఆయన ఒత్తిడితోనే పోలీసులు విచారణ పిలిచారని పోలీసుల విచారణకు సహకరిస్తానని క్రిశాంక్ తెలిపారు. రాజేంద్రనగర్ జరిగిన డబల్ మర్డర్ కేసులో బిజిగా ఉన్న పోలీసులు ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో సోషల్ మీడియా కేసులు విచారణ చేస్తున్నారని ఎవ్వరు ఎన్ని ఇబ్బందులు పెట్టిన ఎదుర్కొంటామని పేర్కొన్నారు.

## బిజెపి బలోపేతానికి కృషి చేయాలి

### -డివిజన్-2 ముఖ్య నాయకులు సమావేశం



**అత్తాపూర్ జూన్7,ప్రభాతవార్త :** దేశ అభివృద్ధి ప్రధాని నరేంద్రమోడీతోనే సాధ్యమని బిజెపి బలోపేతానికి నాయకులు కలిసికట్టుగా పని చేయాలని రంగారెడ్డి జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. శనివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్-2లో ముఖ్యనాయకులు సమావేశం డివిజన్ ప్రెసిడెంట్ సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ ప్రబరి రంగారెడ్డి జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....బిజెపి బలోపేతం కోసం డివిజన్ కమిటీలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. వివిధ మోర్చా కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. దేశ అభివృద్ధి ప్రధాని నరేంద్రమోడీతోనే సాధ్యమని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రధాని మోడీ వచ్చాక దేశంలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. బిజెపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లి కన్వీనర్ మల్లేష్ యాదవ్,పార్లమెంట్ కన్వీనర్ ఎస్‌సి. మోర్చా అధ్యక్షుడు జోగు రవి, ఓబిసి స్టేట్ ఎక్సెట్‌మెంబర్ అడికె రాజు, వై. నర్సు రెడ్డి, అడికె మహేందర్, వల్లూరి శ్రీనివాస్, శ్రీను, గూడూరి అంజి, గోదుగు కొండల, బల్ల శ్రీను యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

**త్యాగరాయ గానసభలో ముగిసిన పద్యనాటకోత్సవాలు**

**చిక్కడపల్లి, జూన్ 7 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని హనుమంతరావు కళావేదికలో గానసభ సౌజన్యంతో ఆరాధన కల్చరల్ అసోసియేషన్ అధినేత లోకం కృష్ణయ్య నిర్వహణలో జరుగుతున్న 'పద్యనాటకోత్సవాల శనివారం ముగిసాయి. ఆఖరి రోజున పాండవోద్యోగము-పాండవుల ఉపప్లావ్య ఘట్టం' ప్రదర్శన జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం హాజరై నాటక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను సత్కరించారు. ఈ నాటకంలో శ్రీకృష్ణుడిగా కుందుర్తి వెంకట కృష్ణ, ధర్మరాజుగా బి.నారాయణస్వామి, భీముడుగా ఎం.సాల్వాచారి, అర్జునుడుగా మల్లాది వెంకటరమణ, నకులుడుగా రాసుల లింగమయ్య, సహదేవుడుగా మరదాపు రామ్మోమనరావు తమతమ పాత్రలను అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, నాటకప్రియులు ఎన్.సాంబశివరావు, ప్రముఖ రచయిత రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి : జగదీశ్వర్‌గౌడ్



హాఫీజ్‌పేట్ ఈద్గాలో బక్రీద్ ప్రార్థనలలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, జూన్ 7 ప్రభాతవార్త** ముస్లీంల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. పవిత్రబక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ ఈద్గా, మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్, భిక్షపతినగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్ లలో నిర్వహించిన ప్రార్థనలలో జగదీశ్వర్‌గౌడ్ పాల్గొని ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వరాష్ట్రంలో పేద ముస్లీంలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, అన్ని కులాలు, మతాలను సమాన భావంతో చూస్తున్న సెక్యూలర్ నాయకుడు సీయం రేవంత్‌రెడ్డి అన్నారు. హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ ఈద్గాలో ప్రభుత్వం తరపున నమాజ్ పూర్తిచేసేందుకు అన్ని ఏర్పాట్లను చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ గౌస్, సయ్యద్ తహెర్, లాలూపటేల్, ముజీబ్, నుమాన్‌బీన్ సయ్యద్, ఎస్‌కే యూసుఫ్, సయ్యద్ పాషా, ఎండి యూసుఫ్ పాల్గొన్నారు.

**మాజీ మంత్రి కెటిఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు**

**గన్‌ఫౌండ్రి, జూన్ 7ప్రభాతవార్త:** అమెరికాలోని డల్లాస్ పర్యనట ముగించుకుని నగరానికి చేరుకున్న బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కెటిఆర్‌ను విమానాశ్రయంలో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు మునుకుంట్ల ఆనంద్‌కుమార్‌గౌడ్ స్వాగతం పలికారు. తెల్లవారు జామున నగరానికి, చేరుకున్న కెటిఆర్‌కు బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున్న స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రక్షణ సహాయ శాఖ మంత్రి సంజయ్ సేథీని సన్మానించిన కార్పొరేటర్

**బేగంబజార్, జూన్ 7ప్రభాతవార్త:** నగర పర్యటన నిమిత్తం వచ్చిన భారత దేశ రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథీన్ని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథీన్ని శాలువ కప్పి సన్మానించారు. పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్ సంఘాలే ఉద్యమించాలి

**-రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్రబాబు, ఎంవి.నర్సింగరావు**



ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేంద్రబాబు, చిత్రంలో ప్రధాన కార్యదర్శి ఎంవి.నర్సింగరావు

**చిక్కడపల్లి, జూన్ 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ సర్కార్ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా మంచి సంప్రదాయం కాదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రాజేంద్రబాబు, ఎంవి.నర్సింగరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావవేశంలో, అంతకుముందు జరిగిన మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల సంఘం కలిసి 50 గంటలు చర్చించినా పెన్షనర్ల సమస్యలు ఏవీ పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు. జూన్ 6న తమ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగిందని, అందులో పాల్గొన్న రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధులందరూ అయిదు డి.ఏ.లు బకాయి ఉండగా ఒక డిఎ విడుదల చేయడం దారుణమన్నారు. ఉపముఖ్యమంత్రి ప్రకటనలో పి.ఆర్ ప్రస్తావనే లేక పోవడం పెన్షనర్లను నిరాశలో ముంచించన్నారు. హెల్త్ కార్డు, , నగదు రహిత చికిత్స విషయంలో స్పష్టత లోపించిందని, అందరికి ఒకేలా నెలకు రూ.500 కాకుండా రూ. 150, రూ.300, రూ. 500గా, వారు తీసుకుంటున్న పెన్షన్ బట్టి మూడు గ్రూపులుగా విభజించి నెలవారీగా వసూలు చేసి, అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ఖాతాలో ప్రతి నెలా జమచేసే విధంగా విధానాన్ని రూపకల్పన చేయాలని ఆరోగ్య శాఖా మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్ సంఘాలే ఉద్యమించాలని వారు హితవు పలికారు.

## చేప ప్రసాదం కోసం వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు



శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలోల పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేటషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్

**చార్మినార్, జూన్ 7 ప్రభాతవార్త :** చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ముందు రోజు ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ దూద్‌బౌలిలోని బత్తిన గౌడ్ కుటుంబ సభ్యుల నివాసంలో శనివారం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం జరిగింది. ఇంటిలో ఉన్న బావికి పూజలు నిర్వహించిన అనంతరం బావిలోని నీటితో చేప ప్రసాదాన్ని తయారు చేయటం ఆనవాయితి అని బత్తిని గౌడ్ కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా శనివారం పాతబస్తీ దూద్‌బౌలిలోని బత్తిని గౌడ్ సోదరుల ఇంటిలో జరిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో బత్తిని గౌడ్ కుటుంబ సభ్యులు, బంధువులు, తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, బత్తిని గౌరి శంకర్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.వెంకటేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేప ప్రసాదం కోసం వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు.

**అమెరికా తానా ప్రపంచసభలకు ధర్మారావు**

**చిక్కడపల్లి, జూన్ 7 ప్రభాతవార్త:** ప్రపంచ అగ్ర తెలుగు సాంస్కృతిక, సేవా సంస్థ తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా) ఆధ్వర్యంలో జరగబోయే 24 వ ద్వైవార్షిక ప్రపంచ సభలకు దేశ విదేశాల్లో తెలుగు భాషా,సాహిత్య సాంస్కృతిక,కళా, సినీ రంగాలకు సేవలందిస్తున్న, సమీకృత అంతర్జాతీయ సాంస్కృతిక సారస్వత సంఘం (ఇట్క్లా) అధ్యక్షుడు సంస్కృతిరత్న, కె.ధర్మారావుకు ఆహ్వానం అందుకున్నారు. శుక్రవారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇట్క్లా గౌరవ అధ్యక్షుడు, దక్షిణమధ్యరైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణతో కలిసి వివరాలు వెల్లడించారు. స్వర్ణోత్సవ సభలకు ముందు జరుగుతున్న ఈ సభ ను అంగరంగ వైభవం గా నిర్వహిస్తున్న సభకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారితో పాటు వివిధ రంగాల తెలుగు ప్రముఖులు, ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయ అధినేతలు, సినీ ప్రముఖులు,సాహిత్య సాంస్కృతిక కళా కోవిదులు తో సహా, దాదాపు పదివేల మంది ప్రేక్షకుల నడుమ , ఉత్సాహ భరితమైన,ఉత్కృష్టమైన కార్యక్రమాలుంటాయన్నారు. తనకు ఆహ్వానం పంపినందుకు తానా కాన్ఫరెన్స్ చైర్మన్ గంగాధర్ నాదెళ్ల,కో ఆర్డినేటర్ ఉదయ కుమార్ చాపలమడుగుకు ధన్యవాదాలు తెలిపారు. 2005 లో డెట్రాయిట్‌లో జరిగిన తానా సభల్లో పాల్గొనడం జరిగిందన్నారు.

**ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన జంపన ప్రతాప్**



బోయిన్‌పల్లిలో ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న జంపనప్రతాప్

**కంటోన్మెంట్,జూన్ 7 ప్రభాతవార్త:** హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతికి ముస్లింలు బక్రీద్ జరుపుకుంటారని మేకల కోసి మాంసాన్ని పేదలకు, బంధువులకు పంచడం అణవాయితీ అని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత జంపనప్రతాప్ తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్‌లోని ఈద్గాల వద్ద ముస్లింలు నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు షకీబ్ హుసెన్, ఇమ్రాన్, చోటూ, మౌలా, ఫరాద్, కాంగ్రెస్ నాయకులు సాయిబాబా యాదవ్, సురేశ్, యాదగిరి పాల్గొన్నారు.

### ఘనంగా ఈద్ ఉల్ జుహా (బక్రీద్ ) పర్వదినం..



బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లి సోదరులు

**నిజాంపేట్, జూన్ 7, ప్రభాతవార్త** త్యాగం, ప్రేమ, సమానత్వానికి ప్రతీక బక్రీద్ అయిన సందర్భంగా బాచుపల్లి మండల మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ఈద్ ఉల్ జుహా (బక్రీద్ )పర్వదినం నిర్వహించారు. బాచుపల్లి మండలం, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, నిజాం తలాబ్ సమీపంలోని సర్వే నెంబర్ 186 పి, ఈద్గా వద్ద మండల మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బక్రీద్ ప్రత్యేక ప్రార్ధనల్లో సుమారు ఐదు వేల మంది ముస్లిం సోదరులు పాల్గొని ప్రార్ధనలు చేసారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సొసైటీ వారు మాట్లాడుతూ త్యాగం, ప్రేమ, సమానత్వానికి ప్రతీక బక్రీద్ అని అన్నారు. ఈ బక్రీద్ పర్వదినాన ముస్లిం సోదరులు మేకలు, గొర్రెలను ఆ అల్లాకు బలిచ్చిఅందులో ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధుమిత్రులకు, మూడవ భాగాన్ని కుటుంబ సభ్యులకు పంచుతూ బక్రీద్ జరుపుకుంటారని తెలిపారు.

## రాందేవ్ రావ్ ఆసుపత్రికి హరిత పురస్కారం

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 7, ప్రభాతవార్త** ప్రకృతిని రక్షించే దిశగా అంకితభావంతో చేసిన కృషికి గుర్తింపుగా రాందేవ్ రావ్ ఆసుపత్రికి ఈ సంవత్సరం యశోద హాస్పిటల్, హెల్ప్ ఆర్గనైజషన్ సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రికి హరిత పురస్కారం లభించింది. కూకట్పల్లిలో రాందేవ్ ఆసుపత్రిని కూకట్పల్లి ఊపిరితిత్తులు (లంగ్స్ ఆఫ్ కూకట్పల్లి)గా అభివర్ణించడం జరిగింది. ఈ పురస్కారం పచ్చదనం పరిరక్షణ గురించే కాకుండా సేఫ్ బయో మెడికల్ వాడకం, ఎస్‌టిపి, సోలార్ వాడకం గురించి కూడా పరిణిలోకి తీసుకొని ఇవ్వడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ, మొక్కల నాట్లు, ఆకుపచ్చ పరిసరాల ఏర్పాటులో మా సంస్థ చేసిన నిరంతర శ్రమకు ఈ పురస్కారం ఒక ప్రేరణగా నిలుస్తుందని ఆస్పత్రి వర్గాలు తెలియజేశాయి. ఈ గౌరవం మాకు లభించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, ఈ విజయానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ మనః పూర్వక కృతజ్ఞతలు. భవిష్యత్తులో కూడా మరింత ఉత్సాహం గా పర్యావరణ హిత కార్యకలాపాలు కొనసాగిస్తామని, ఆసు పత్రి సీఈఓ డాక్టర్ యోబు తెలిపారు. రాందేవ్ రావ్ ఆసుపత్రి తరుపున ఈ అవార్డుని యోబు డాక్టర్ స్వాతి రెడ్డిలు స్వీకరించారు.

## కూకట్‌పల్లిలో ఘనంగా బక్రీద్ వేడుకలు...



బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లి సోదరులు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 7, ప్రభాతవార్త** కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో శనివారం ముస్లిం సోదరులు బక్రీద్ వేరుకలను ఘనంగా జరుపుకున్నారు. మూసాపేటలోని ఈద్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒక్కరినొక్కరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మూలాసాబ్, మహ్మద్, చున్ను పాషా, మోయిజు తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా ఆహార పదార్థాలు పంపిణీ




కార్యక్రమంలో పాల్గొన్న టి.ఎస్ బసవ కేంద్రం అధ్యక్షులు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి

**మైలార్‌దేవ్‌పల్లి,జూన్ 7 ప్రభాతవార్త :** మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల ఎనిమిదివ తేదీన జరగనున్న చేప ప్రసాదం కోసం వచ్చే ప్రజలకు తెలంగాణ రాష్ట్ర బసవ కేంద్రం అధ్యక్షులు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉచితంగా ఆహార పదార్ధాలను అందజేశారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు మహాత్మా శ్రీ బసవేశ్వరుని చిత్ర పటానికి నాగ్‌నాథ్ మాశెట్టితో పాటు పలువురు పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం బసవ కేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా చేప ప్రసాదం కోసం వస్తున్న ప్రజలకు ఆహార పధార్ధాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ శైలం దేవ స్థానం పాలక మండలి మాజీ సభ్యులు, బసవ సంక్షేమ సమితి అధనయక్షులు కల్వ మల్లిఖార్జునప్ప, సీనియర్ బిజెపి నాయకులు గోవింధ్ రాఠీ, ప్రతినిధులు దినేష్ టన్నే, నాగరాజ్ శిల్వంత్, అశోక్ మాశెట్టి, రమేష్, సోలాపురే, బాబు మాశెట్టి, ప్రశాంత్, సంతోష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## లాల్‌దర్వాజ ఆలయంలో ప్రారంభమైన రంగుల పనులు



కార్యక్రమంలో పాల్గొన్న దేవాలయం కమిటి చైర్మన్ మారుతి యాదవ్, కమిటి ప్రతినిధులు

**చార్మినార్, జూన్ 7 ప్రభాతవార్త :** ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలకు లాల్‌దర్వాజ సింహవాహినీ శ్రీ మహంకాళీ దేవాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటి చైర్మన్ బి.మారుతి యాదవ్ కమిటి సభ్యులతో కలిసి దేవాలయానికి రంగుల వేసే కార్యక్రమానికి శ్రీ కారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 11 వతేదీ నుంచి బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా లాల్ దర్వాజ సింహవాహినీ శ్రీ మహంకాళీ దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం లో ఆలయం పూజారి రామకృష్ణ శర్మ, ఆలయ కమిటి మాజీ చైర్మన్లు కె. విష్ణు గౌడ్, కె.వెంకటేష్, సిరా రాజ్ కుమార్, కార్యదర్శి యశ్వంత్ గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## హమాలీ, రైతులకు వైద్య సేవలు అందిండం అభినందనీయం : ఆనంద్ బాబు


బోయిన్‌పల్లి మారె ్కట్‌లో ఉచిత వైద్యశి బిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్ బాబు

**కంటోన్మెంట్, జూన్ 7 ప్రభాతవార్త:** బోయిన్‌పల్లి మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు, రైతులకు ఉచిత వైద్య సేవలు నిర్వహించడం అభినందనీయమని మార్కెట్ యార్డు చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు గౌడ్ తెలిపారు. శనివారం బోయిన్‌లప్లి మార్కెట్‌లో హమాలీలకు, రైతులకు, మార్కెట్ సిబ్బందికి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయ రైతులు, హమాలీలు, తమ ఆరోగ్యాని ్న పట్టించుకోకుండా పనిచేస్తారన్నారు. ఇటువంటి సమయంలో వారికి మారె ్కట్‌లోనే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్ (దేవుడు), మార్కెట్ సభ్యులు పాల్గొనా ్నరు.

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు సన్మానం


కూన శ్రీశైలం గౌడ్‌ని ఘనంగా సత్కరిస్తున్న కార్మిక సభ్యులు

**పేట్ బషీరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆయన నివాసం వద్ద ఫ్లెమింగ్ ల్యాబరేటరీ కార్మికులు శనివారం కలిసి కార్మిక ఒప్పంద అగ్రిమెంట్‌కు కృషిచేసిన సందర్భంగా సన్మానించడం జరిగింది. అనంతరం కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ కూన శ్రీశైలం గౌడ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలకు, కార్మిక కర్షకులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమాజ మనుగడ శ్రామిక లోకంతో ముడిపడి ఉందన్నారు. రాజనీతిజ్ఞుడిగా ప్రజలకు సేవచేస్తూ, కార్మిక నాయకుడిగా కార్మికుల సమస్యలపై పోరాడుతనన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వైసర్ మల్లేశం, జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వరా రావు, కార్మిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త ప్రజలకు అండగా ఉండాలి


సమావేశంలో పాల్గొన్న నేతలు

**అడ్డగుట్ట, జూన్ 7 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లో స్టేట్ కౌన్సిల్ మెంబర్ పోచయ్య యాదవ్ అధ్యక్షతన డివిజన్ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తల సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా పోచయ్య యాదవ్ మాట్లాడుతూ భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేసిన అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రపంచ దేశాలతో పోటీ పడి భారతదేశాన్ని మొదటి స్థానంలో నిలపడానికి ప్రధాని చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాని అన్నారు. అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య మాట్లాడుతూ డివిజన్లో పార్టీని బలోపేతం చేయాలని, ఎల్లవేళలా డివిజన్లో ప్రజలతో మమేకమై డివిజన్లో ఉన్నటువంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కమిటీ సభ్యులు కృషి చేయవలసిందిగా వివరించారు. ఈ కార్యక్రమంలో మహేష్, నర్సింగ్ రావు, కృష్ణ, కన్నాబిరామ్, కళావతి, శ్యామల, ప్రేమలత, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పాలన అభినందనీయం


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్, జూన్ 7 ప్రభాతవార్త:** కేంద్రంలో బిజెపి 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మోండా డివిజన్‌లో బీజేపీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ బీజేపీ సీనియర్ నాయకుడు బానుక మల్లికార్జున్ లు ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రస్థానంలో నిలుపడం కోసం ప్రధాని మోడీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హరినాథ్ ఇతర నేతలు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యాసంస్థగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ

### -ఎమ్మెల్యే పద్మారావు గౌడ్


పద్మారావుగౌడ్‌తో సమావేశమైన ప్రిన్సిపాల్ భారతి తదితరులు

**సికింద్రాబాద్, జూన్ 7 ప్రభాతవార్త :** సితాఫలమండీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఉత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్దేలా తమ వంతు కృషి చేస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ గా కొత్తగా నియమితురాలైన డాక్టర్ జి. బంగ్ల భారతి శనివారం పద్మారావు గౌడ్‌తో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. కొత్త భవనాల నిర్మాణం, ఇతరత్రా అంశాల్లో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ 2015లో తమ కృషి కారణంగా సితాఫలమండీ స్కూల్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. కొత్త భవనాల నిర్మాణానికి రూ.29.75 కోట్ల మేరకు నిధులను గతంలో మంజూరు చేయించమని తెలిపారు. డిగ్రీ కాలేజీని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భారతితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

## 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### -జిల్లా ఇంచార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ

**నాచారం, జూన్ 7 ప్రభాతవార్త :** నాచారం బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో శనివారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశనికి జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా తిప్పారపు లక్ష్మణ్ మాదిగ జిల్లా ఇంచార్జీ పాల్గొని మాట్లాడుతూ జులై 7 న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రతి గ్రామంలో నిర్వహించాలని, అదే విధంగా ప్రతి గ్రామములో గ్రామ కమిటీ వేయాలని పిలుపునిచ్చారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ తన జీవితాన్ని మాదిగ సమాజం కోసం అంకితం చేసాడని,ప్రతి సంక్షేమ పథకం లో మంద కృష్ణ మాదిగ పోరాటం ఉందన్నారు.మాదిగ జాతి కోసం పోరాడుతూనే సమాజంలో సబ్బండ వర్గాల శ్రేయస్సు కోసం పాటు పడిన వ్యక్తికి పద్మశ్రీ రావడం ఎంతో సంతోషాదయకమన్నారు. జాతి కోసం చేసిన పోరాటాన్ని గ్రామాలలో తెలియజేయాల్సి న బాధ్యత మన అందరి పైన ఉందన్నారు.దాంట్లో భాగంగా ఏల్ ఈడి స్క్రీన్ లు ఏర్పాటు చేసి ఉద్యమ ప్రస్థానాన్ని చూపించాలని అన్నారు.అదే విధంగా ఉద్యమనికి అండగా ఉన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞత తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్ వై అశోక్ మాదిగ,జాతీయ నాయకులూ కేశాపగా రాంచందర్ మాదిగ, కో ఇంచార్జ్ ముంద్రాతి అరుణ్ మాదిగ ,సీనియర్ నాయకులూ కొరపాక అంజి మాదిగ , కేశవ్ మాదిగ , మహిళా అధ్యక్షురాలు సలోమి ,సగ్గు శివ , బచ్చలికూర స్వామి , శ్రీనివాస్ అన్ని మండలాల నుండి నాయకులూ పాల్గొన్నారు.

## బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావం

### -రాజకీయ సమాన అవకాశాలు కల్పిస్తూ ముందుకు పోవాలనే సంకల్పంతో ఏర్పడింది
### -రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను సాంబయ్య


బహుజన్ రాజ్యాధికార పార్టీని లోగోను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను సాంబయ్య

**చిక్కడపల్లి, జూన్ 7 ప్రభాతవార్త:** బహుజన రాజ్యాధికార ఎపార్టీ ఆవిర్భావ సభ శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు. అ సందర్భంగా పార్టీ లోగోతోపాటు విధివిధానాలను ఆవిష్కరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులుగా జన్ను సాంబయ్య, ఉపాధ్యక్షులుగా ఎండ్ల రవి ముదిరాజ్, కిసర రజిత, ప్రధాన కార్యదర్శిగా బుర్రి సాగర్, అధికార ప్రతినిధిగా అంకేశ్వర్ రమేష్, కార్యదర్శిగా మధుకర్నాయక్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జన్ను సాంబయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి అండగా ఉంటూ బహుజన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకుపోతాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ సుద్దాల సురేందర్, భక్తుల సిద్దేశ్వర పటేల్, కొంగల నరహరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన్ను సాంబయ్య మాట్లాడుతూ తెలంగాణ బహుజన ప్రజలారా ఒక్కసారి ఆలోచించండి, ఉమ్మడి రాష్ట్రంలో గత 40 సంవత్సరాలుగా జరుగుతున్న కుల దళిత బహుజన ఉద్యమ ప్రతిఫలాలు ఎవరికి చెందుతున్నాయి, పోరాటాలకు త్యాగాలకు ముందు వరసలో ఉండి లాటి దెబ్బలు తింటూ త్యాగాలకు తెగించి పోరాడితే వాటి ప్రతిఫలాలు పొందేది మాత్రం అగ్రకుల పాలక పార్టీల నాయకులు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా మన బహుజన మహనీయులైన మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కాన్సిరాం కోరుకున్నదా అని ప్రశ్నించారు. ఇకనైనా మేలుకొని రాజ్యాధికారంలో మన వాటా కోసం ప్రతి పేదవారికి సొంత భూమి ఉపాధి ఉద్యోగం తో పాటు నాణ్యమైన ఉచిత విద్య వైద్యం తో సాంఘిక ఆర్థిక రాజకీయ రంగాలలో ప్రతి ఒక్కరికి సమానత్వం కల్పిస్తూ బహుజన మహనీయుల ఆశయాల పునాదులపై పుట్టుకు వస్తున్న బహుజన్ రాజ్యాధికార పార్టీని ఆశీర్వదించాలని కోరారు. ప్రజల పక్షాన ప్రజల కోసం నిర్భయంగా రాజ్యాధికారమే చేపట్టే దిశగా ముందుకు సాగుతూ తెలంగాణలోనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలు అగ్రకులాలలో పేదలకు రాజకీయ సమాన అవకాశాలు కల్పిస్తూ ముందుకు పోవాలనే సంకల్పంతో ఏర్పడిందన్నారు.

## తాగ్యానికి ప్రతీక బక్రీద్ : ఎమ్మెల్యే శ్రీగణేష్


ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం మైనార్టీలు

**అడ్డగుట్ట,జూన్ 7 ప్రభాతవార్త:**

దైవ ప్రవక్త ఇబ్రాహీం త్యాగాలను గుర్తు చేసుకుంటూ ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ లోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు శనివారం తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ముస్లింలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ రంజాన్ పండుగ దాన ధర్మాలకు ప్రతీక అయితే బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని,స్వార్థం, అసూయలను విడిచిపెట్టి మానవతా వ్వాన్ని వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగన్నారు.

## మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా బివి రావు నియామకం


ఎమ్మెల్యే డా. జి.వి వెంకట స్వామి చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని తీసుకుంటున్న బివి.రావు

**తార్నాక, జూన్ 7 ప్రభాతవార్త :**

గ్రేటర్ హైదరాబాద్ మాల మహానాడు అధ్యక్షులుగా ఓ.యూ విద్యార్థి,న్యాయవాది బండ వరప్రసాదరావు (బివి రావు) నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రముఖ దళిత నాయకులు చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ జి.వి వెంకట స్వామి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లముల్ల హసేన్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కాగా బి.వి రావు విద్యార్థి దశ నుండే విద్యార్థి ఉద్యమాల్లో పనిచేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయవాద విద్యను అభ్యసించి గత 15 సంవత్సరాలుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంతో మాల మహానాడు క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఈ బడుగు బలహీన వర్గాల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ ఉద్యమంలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేసిన మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి రావు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య పాశం వెంకటేశ్వర్లు బేగరీ, మెదరిపాల్సన్,శివరాజ్ తధితరులుకు బి.వి రావు కృతజ్ఞతలు తెలిపారు.

## రైల్ ప్రమాదంలో వ్యక్తి మృతి

**అడ్డగుట్ట,జూన్ 7 ప్రభాతవార్త:** మూడు నెలల క్రితం పెళ్లి చేసుకున్న నవదంపతులు హనీమూన్‌కు వెళ్తుండగా రైల్ ప్రమాదంలో ఓ యువకుడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మృతి చెందాడు. జి.ఆర్.పి.ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ కరీమాబాద్‌కు చెందిన ఉరుగొండ సాయి (28), అతని భార్య బత్తుల మాధురి (23) అతని బంధువులతో కలిసి ఈ నెల 6వ తేదీన వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్‌లో గోవకు వెళ్తున్నారు. వాటర్ బాటిల్ కోసం రైల్ దిగి తెచ్చుకొని వస్తుండగా రైల్ కదిలింది. దీంతో బంధువులు గమనించి చైన్ లాగడంతో పోలీసు లు వారిని అడ్డుకొని వాదించారు. సాయి పోలీసులతో మాట్లాడి కదులుతున్న రైల్‌ను ఎక్కబోతుండగా కాలు జారీ రైల్, ఫ్లాట్‌ఫారం మధ్యలో పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన సాయిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ కేసును రైల్వే జి.ఆర్.పి.ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ దర్యాప్తు చేస్తున్నారు.

## అంతర్జాతీయ నృత్యపోటీల్లో విజేతలుగా నగర చిన్నారి కళాకారులు



నృత్య పోటీల్లో బహుమతులు పొందిన చిన్నారి కళాకారులు

**నాంపల్లి, జూన్ 7 ప్రభాతవార్త :** అన్నిరంగాల్లో ఆధునిక పోకడలు విజృంభిస్తున్నా నగర చిన్నారి కళాకారులు అందుకు భిన్నంగా భారతీయ నృత్యకళలను ఆరాధించి అభ్యసించి తమ ప్రతిభాపాటవాలను అంతర్జాతీయ నృత్యపోటీల్లో విజేతలుగా నిలువడం విశేషం... ప్రశంస నీయం. ప్రముఖ గోవా కళా అకాడమీ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన నృత్యపోటీల్లో హైదరాబాద్‌కు చెందిన ఫ్రీ టూ ఫ్లై డ్యాన్స్ స్టూడియో డ్యాన్స్ మాస్టర్ పూనమ్ మదాన్ నేతృత్వంలో శిష్యులు తనిష్క, రైనా, శ్రీయేష్, అనుష్, హయతి, శ్రీయలు పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. వీరిని ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత కొరియోగ్రఫర్లు వైభవ్, శుబామ్‌బోడేలు సన్మానించి బహుమతులు అందజేసి శుభకాంక్షలు, ఆశీస్సులందజేశారు.

### గండిపేట మండలంలో ఘనంగా బక్రీద్ వేడుకలు


మణికొండలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లీం సోదరుల దృశ్యం

**నార్సింగి, జూన్ 7 ప్రభాతవార్త :** గండిపేట మండలంలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు, దర్గా ఖలిస్కాన్, హైదర్షాకోట్, బండ్లగూడ ప్రాంతాలలో, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్‌నాంపూర్‌లలో, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి, గండిపేట ప్రాంతాలలో ముస్లీం సోదరులు దర్గాలు, ఈద్గాలు, మసీదల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందువులు సైతం ముస్లీ సోదరులకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపి మత సామరస్యతను చాటుకున్నారు. మణికొండలో రాజకీయ నాయకులు షేక్ ఆరిఫ్, మహ్మద్ రిజాయుద్దీన్ పటేల్, మహ్మద్ మునాఫ్, అక్బర్, సాధిక్, సయ్యద్ ఫాజిల్, తక్డీర్, బాషా ఫజ్లూర్ రహ్మాన్, మహ్మద్ బషీర్, పీరం చెరువులో సయ్యద్ ఖాజా, సాధిక్‌లు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.

## చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి....

**బేగంపేట జూన్ 7,ప్రభాతవార్త :** ప్రమాద వశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి పడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఎంఎస్‌మక్తాకు చెందిన సీ. హెచ్.సూర్యరాజ్(39) ప్రయివేటు ఉద్యోగి గా పనిచేస్తున్నాడు.ఈ నెల 4వతేదీన అర్థరాత్రి గం 12.30నిల సమయంలో తన ద్విచక్రవాహనంపై సికింద్రాబాద్ నుంచి బేగంపేట వైపు వస్తూ మహర్షి కాలేజి సమీపంలో వాహనం స్కిడ్ అవడంతో కింద పడ్డాడు.ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి.వెంటనే అతన్ని అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు.చికిత్స పొందుతున్న సూర్యరాజ్ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.ఈ మేరకు అతని బంధువు సుధాకర్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేసారు.

## నేత్రపర్వం శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం


శ్రీ వేంకటేశ్వరస్వామివారి కళ్యాణోత్సవం జరిపిస్తున్న ఆలయ అర్చకస్వాములు

**నాంపల్లి, జూన్ 7 ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్‌లో ఉన్న శ్రీసంగమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి షోడశ వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కళ్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. జూన్ 3 మంగళవారం నుండి 8 ఆదివారం వరకు శ్రీ అలిమేలుమంగా, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారికి వైభవోపేతంగా నిర్వహిస్తున్న విశేష కైంకర్యాలలో శుక్రవారం ఉదయం 9గంటల నుండి నిత్యహోమం, శ్రీలక్ష్మీ సుదర్శనయాగం, ఎదుర్కోలు ఉత్సవం, నిత్యహోమం; రాత్రి 7గంటల నుండి నిత్యహోమము, రథోత్సవం, శ్రీవారి కళ్యాణోత్సవం ఆలయ అర్చకస్వాములచే ఘనంగా నిర్వహించారు. ఈరోజు ఉదయం 9గంటలకు మహాపూర్ణాహుతి, చక్రస్నానము, కుంభ ప్రోక్షణ; రాత్రి 5గంటలకు శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, దేవతోద్వాపన, ధ్వజారోహణం, రాత్రి 8గంటలకు డోలోత్సవం, కార్యక్రమ పరిసమాప్తి, పండిత సన్మానం, వేద ఆశీర్వచనం జరిపించారు. రేపు 8 ఆదివారం ఉదయం 8గంటల నుండి శతఘటాభిషేకం తదితర కార్యక్రమాలుంటాయని కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ తెలిపింది.

## గ్రామాల్లో ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి

### -గ్రామీణ విద్యా జ్యోతి భారతి


సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

**హైదరాబాద్, జూన్ 7,ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక విద్య ను బలోపేతానికి కృషి చేస్తున్నట్లు గ్రామీణ విద్యా జ్యోతి భారత్ (జివిబి) మేనేజింగ్ డైరెక్టర్ సోమశేఖర్ తెలిపారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆల్ ఇండియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏఐపిఎస్ఏ) సింజు అగస్టిన్, జివిబి డైరెక్టర్లు శ్రీనివాస్ , రామకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్ ఆపై చదువు పూర్తి చేసిన మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆయా ప్రాంతాలలో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆల్ ఇండియా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (ఎఐపిఎస్ఏ), గ్రామీణ విద్యా జ్యోతి భారత్ (జివిబి) సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ ఏపీలో పైలెట్ ప్రాజెక్టుగా 50 పాఠశాలలు చొప్పున ప్రారంభించనున్నామని చెప్పారు. ఈపాఠశాలలు మండలాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇంటర్ ఆపైన చదువిన మహిళలకు టీచింగ్లో శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దామని, తద్వారా వారికి ఉపాధి లభిస్తుందన్నారు. పాఠశాలలో చేరిన తర్వాత అందుకేనవారికి నెలవారీగా జీతం అందిస్తామన్నారు. విద్య వ్యాపారమయం కావడంతో పాటు ప్రాథమిక విద్య నిరక్ష్యానికి గురవుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. స్థానికంగా నివసిస్తూ ఆప్రాంత పిల్లలకు విద్యాబోధన చేయాలని ఆసక్తి కలిగిన మహిళలకు మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ అందిస్తామని అన్నారు.

## క్రైస్తవుల సమగ్రాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తా



తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్(టియుసిపిఏ) ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 7 ప్రభాతవార్త:**

క్రైస్తవుల సమగ్రాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్(టియుసిపిఏ) ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ అన్నారు. శనివారం ఇంటర్నేషనల్ వైఎంసిఏ 181 వార్షికోత్సవ సభ గ్రేటర్ హైదరాబాద్ వైఎంసిఏ ప్రధాన కార్యదర్శి వినయ్ స్వరూప్ ఆధ్వర్యంలో జరిగింది. అతిథులుగా క్రైస్తవ ప్రముఖులు సిఎస్ఐ మోడరేటర్ ఇంచార్జ్ డాక్టర్ రుబెన్ బిషప్, కరీంనగర్, మెదక్ డియోసీజ్ డాక్టర్ పి.జోనోథన్ ధర్మరాజ్‌లు హాజరై స్మాల్మన్‌రాజ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా గోనె సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2వేల మంది పాస్టర్లకు నెలకు రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాస్టర్లందరు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. క్రిస్టియన్ మైనారిటీలను బిసి(సి)లో చేర్చాలని, క్రిస్టియన్ మైనారిటీ ప్రొటెస్టెంట్స్‌లకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్య ఇవ్వాలని, అదే విధంగా క్రిస్టియన్ స్మశానవాటికలకు అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేలా భూములను కేటాయించాలని, రూ.5లకే యూనిట్ విద్యుత్తును సరఫరా చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎంసిఏ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ప్రెస్లీ పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్న స్వరూప నాగేష్ యాదవ్


నిరుపేద యువతి వివాహానికి రూ.50.వేల నగదును అందిస్తున్న వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ గొల్ల స్వరూప నాగేష్ యాదవ్.

**నార్సింగి, జూన్ 7 ప్రభాతవార్త :**

నిరుపేద ఆడబిడ్డలకు గండిపేట మండలం వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ గొల్ల స్వరూప నాగేష్ యాదవ్ అండగా నిలుస్తున్నారు. గత దశాబ్ద కాలంగా తనను కలిసిన పేద యువతులందరికి ఆర్థిక సహాయం అందిస్తూ వస్తున్నారు. తాజాగా శనివారం వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన బుడాల పెంటయ్య కూతురు పెళ్లి ఉందని మాజీ సర్పంచ్ స్వరూప నాగేష్ వద్దకు వచ్చి కలిశారు. పేద యువతి కావడంతో వెంటనే రూ.50.వేల నగదును అందజేసి తనవంతు సహకారం అందించారు. ఈ డబ్బులు అందుకున్న పెంటయ్య పది వేలు ఇస్తారని వచ్చానని, ఏకంగా రూ.50.వేలు ఇవ్వడం తన జీవితంలో మరువలేనని పేర్కొన్నారు. సర్పంచమ్మ చేసిన మేలును ప్రాణం ఉన్నంత వరకు గుర్తుంచుకుంటామని తెలిపారు. అనంతరం స్వరూప నాగేష్ యాదవ్ మాట్లాడుతూ పేదలకు అందిస్తున్న చేయూతలో అనంతమైన సంతృప్తి కలుగుతుందన్నారు. నేను చేస్తున్న ఆర్థిక సహాయం ఓ ఆడబిడ్డ జీవితాన్ని నిలబెట్టేందుకు ఉపయోగపడుతుందని, ఇలాంటి మంచి అవకాశాన్ని ఆ దేవుడు మాకు కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. నా వద్దకు వచ్చే నిరుపేదల పెళ్లిళ్లకు ఆర్థిక సహకారం అందిస్తూనే ఉంటానని స్వరూప నాగేష్ యాదవ్ స్పష్టం చేశారు.

## చిత్రకారుడు శీలావీర్రాజు అక్షరాలు శిలాక్షరాలే

### -రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ


శీలావీర్రాజు పురస్కారాలతో మునిసురేష్, పి.ఎస్.చారిలను ఘనంగా సత్కరిస్తున్న మామిడిహరికృష్ణ, విహారి, అమృతలత, సుభద్రాదేవి తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూన్ 7 ప్రభాతవార్త :**

శీలా వీర్రాజు ఒక గొప్పచిత్రకారుడని, శీలావి లేకపోవచ్చుగానీ ఆయన అక్షరాలు శిలాక్షరాలుగా 250 కవుల కవితల మొదటి పుస్తకం వచ్చిందన్న శీలావీ సాహిత్య చిత్రకళావేదిక ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో రాత్రి విహారి సభాధ్యక్షతన జరిగిన శీలా వీర్రాజు పురస్కార సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతి కశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ ముందుగా శిలాక్షరాలు (శీలావీ ఫాంట్‌తో కవితా సంకలనం), ఒక చిత్రకారుడు–కొన్ని అవలోకనాలు (వ్యాస సంకలనం)లను ఆవిష్కరించి ప్రసంగించారు. తెలుగులిపి ప్రపంచంలోకి వచ్చిన గ్రంథమిదని, అలాగే చిత్రకారుడిగా శీలావి అని రాసిన వ్యాసాల సంకలనం రెండవదని, ఈ రెండు సంకలనాలను శీలా శుభద్రాదేవి తెచ్చినందుకు అభినందించారు. అనంతరం కె.ఎ.మునిసురేష్ పిళ్ళై (గారడీవాడు)ను, పి.ఎస్.చారిలపే ఘనంగా సత్కరించి శీలావీర్రాజు కథానికా, శీలావీ చిత్రకళా పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. అనంతరం శిలాక్షరాలు తొలిప్రతిని డా. అమృతలత అందజేశారు. శిలాక్షరాలు పుస్తకపరిచయం శీలా సుభద్రాదేవి కావించారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన సంతోష్ యాదవ్


మారేడ్‌పల్లిలో ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్

**అడ్డగుట్ట,జూన్ 7 ప్రభాతవార్త:**

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మారేడ్‌పల్లి దర్గాలో ముస్లిం సోదరులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లిం మైనార్టీలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు ఎండి షాదిక్, బాబా ఖల్లీ, సయ్యద్ జలాల్, ఎండి. జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతంగా సాగిన కూచిపూడి నృత్య మహోత్సవాలు

**చిక్కడపల్లి, జూన్ 7 ప్రభాతవార్త:** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కురుగంటి కళాక్షేత్రం, చారిటబుల్ ట్రస్ట్ ప్రిన్సిపాల్ కురుగంటి రాధిక, కె.సుదర్శన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 28వ వార్షికోత్సవ వేడుక శనివారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కురుగంటి రాధిక నేతృత్వంలో రూపొందించిన 'శ్రీకృష్ణ లీలామృతం' పేరుతో నిర్వహించిన ప్రదర్శన అందరిని మంత్రముగ్ధులను చేసింది. విశిష్ట అతిథులుగా హాజరై వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు హాజరై వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రముఖ నృత్యగురువులు ఓలేటి రంగమణి, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ వై.మల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పాత్రికేయులు మహ్మద్ రఫీ, ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.చంద్రకాంత రావు, మృదంగ విద్వాంసులు వేముగంటి శ్రీధరాచార్య, నాట్య విశారద వాణీరమణ, తమన్నాస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తమన్న శ్రీధర్ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కాపూరి శ్రీనివాస్, తంగిరాల నరేష్, డాక్టర్ ఎస్.భరత్, ప్రముఖ నటులు జెఎల్.శ్రీనివాస్, డాక్టర్ కెపివి.కుందనిక తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎమ్మెల్యే బలాల



ఉజాలేష ఈద్గా లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల తదితరులు

**మలక్ పేట, జూన్ 7, ప్రభాతవార్త:** ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని అక్బర్ బాగ్ లోని ఉజాలేష ఈద్గాలో ఎమ్మెల్యే బలాల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. అదేవిధంగా బక్రీద్ పండుగను పురస్కరించుకొని మలక్ పేట ఏసిపి సుబ్బిరాంరెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఇంజాపూర్ గ్రామంలో బక్రీద్ పండుగ వేడుకలు

### -ముస్లీం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**తుర్కయంజాల్, జూన్ 7 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటిపరిదిలోని ఇంజాపూర్ గ్రామంలో బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈద్గా దగ్గర ముస్లిం సోదరులకు ప్రార్థనల అనంతరం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , మరియు గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పాషా, ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఎమ్మెల్యే వారు మాట్లాడుతూ కులమత బేధాలు లేకుండా సోదరభావంతో కలిసికట్టుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల మున్సిపాలిటీ మైనార్టీ అధ్యక్షు మొహమ్మద్ గౌస్ పాష, ఇంజాపూర్ మసీద్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ రహీం, ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఆజాజ్ , మహమ్మద్ ఉస్మాన్, మహమ్మద్ మజీద్, మహమ్మద్ ఆజాద్, మహమ్మద్ నజీర్, ఫిరోజ్ ఖాన్, మహమ్మద్ ఫయాజ్, మహమ్మద్ షారుక్, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న మధురఉపేందర్‌రెడ్డి దంపతులు

**ఎల్.బి.నగర్ జూన్ 7 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ పరిధిలోని సౌభాగ్య పురం కాలనీలోని శ్రీ అలివేలుమంగ పద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానము (కంచి కామకోటి పీఠమువారి ఆధ్వర్యంలో) చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధురఉపేందర్‌రెడ్డి దంపతులు బ్రహ్మోత్సవాలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వారిని మంత్రోచ్చారణతో దీవించారు, అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ చంద్ర శేఖర్, వైస్ ప్రెసిడెంట్ రమణయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, కోశాధికారి మూర్తి, సౌభాగ్య పురం కాలనీ సెక్రటరీ నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో మండల పూజా మహోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్ జూన్ 7 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ నాగేశ్వర్ నగర్ కాలనీలో శ్రీదాసాంజనేయస్వామి వారి దేవాలయంలో శివ పంచాయతన, వేద దక్షిణామూర్తి శ్రీలక్ష్మీ సమేత హయాగ్రీవ స్వామివారి మండల పూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, విజయ్ భాస్కర్, రమేష్, నారాయణ, బిజెపి నాయకులు మంచి రాజేష్, రాకేష్‌యాదవ్, తోట మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం : కార్పొరేటర్



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ జిఏ1 కాలనీలో రూ.16లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వి.రామకృష్ణ, కార్యదర్శి ఎ.రమేష్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఆనంద్, బిజెపి నాయకులు సూరజ్ అప్పింగికర్, కార్తీక్, రమణ్ సింగ్, సుధీర్‌రెడ్డి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొనసాగుతున్న మహా కుంభాభిషేకం ప్రత్యేక పూజలు

### -ఉత్సవ కమిటీ చైర్మన్ చేగురి వెంకటరమణ

**మలక్ పేట ,జూన్ 7 ప్రభాతవార్త:** మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో ని శ్రీ శ్రీ శ్రీ గరుడ అభయ ఆంజనేయస్వామి, లక్ష్మీ గణపతి సహిత శ్రీ భవానీ శంకర సహిత నవగ్రహ నాగదేవత దేవాలయంలో 7వ తేదీ శనివారం నాడు మహా కుంభాభిషేకం ( సహస్ర ఘటాభిషేకం) తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. దేవాలయం ఉత్సవ కమిటీ చైర్మన్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాకుంభాభిషేకం పూజా కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం గురు ప్రార్థన, వేద స్వస్తి, మంటప ఆవాహిత పూజలు, మన్యు సూక్త 108 సార్లు హవనం, సహస్ర కలశ వరుణ పూజ (1008), సాయంత్రం 5 గంటలకు మంటప పూజలు, మన్యు , రుద్ర, గణపతి, నవగ్రహ, సూక్త పారాయణాలు , నీరాజనం, రాత్రి తీర్థ ప్రసాద వితరణ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ మాట్లాడుతూ 8వ తేదీ ఆదివారం ఉదయం సహస్ర 1008 కలశ ఉద్వాసన, దేవాలయ శిఖర మరియు శ్రీశ్రీశ్రీ గరుడ అభయ ఆంజనేయ స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం, మహా కుంభాభిషేకం, బలి ప్రధానం, మహా పూర్ణాహుతి, శిఖరానికి పూర్ణాభిషేకం, శ్రీ సీతారాముల కళ్యాణం, వేద ఆశీర్వచనం, అన్నదానం, ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు వివరించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని చేగురి వెంకటరమణ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, ఉపాధ్యక్షులు దుగ్గు జగదీష్ కుమార్, మాదారం కృష్ణ, సభ్యులు గంగా బాలాజీ, విశ్వం, తల్లం శ్రీకాంత్, అనిల్ కుమార్, ఆంజనేయులు, సిహెచ్ అనంతరెడ్డి, నూక సంతోష్, గందే శ్రీధర్, ప్రమోద్, సురేష్, మైల రవికాంత్, వెంకటేష్, అజయ్ కుమార్, బి. సురేందర్, రజనీకాంత్,కె. వెంకట్ రెడ్డి, శంకర్ మహతో అయ్యన్న గారి పాండు, వంజరి రమేష్, ఓం ట్రేడర్స్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్ చేగురి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, గంగా బాలాజీ, తదితరులు

## ఉప్పల్ కురుమ సంఘం భవన నిర్మాణ పనుల పరిశీలన

**నాచారం, జూన్ 7 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలో ఉన్న భారత్ నగర్ లో రూ.30 లక్షలతో చేపడుతున్న ఉప్పల్ కురుమ సంఘం రెండవ అంతస్తు భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ మేరకు శనివారం ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి శనివారం పనులను ఉప్పల్ కురుమసంఘం నాయకుల తో కలిసి పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగే మల్లేష్ కురుమ,జోన్ ఉపాధ్యక్షులు గొరిగే పెద్ద మల్లేష్ కురుమ,వెలుగు గుట్ట దేవస్థానం చైర్మన్ జన్ని రఘు కురుమ, ,ఉప్పల్ కురుమ సంఘం అధ్యక్షులు చిందం వెంకటేశ్ కురుమ,సల్లా ప్రభాకర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల కృష్ణ కురుమ ,సలహాదారులు గొరిగే ఐలయ్య కురుమ, సంగం నాయకులు బట్టికిరి బీరప్ప ,కురుమ యువత అధ్యక్షులు ముత్యం రాకేష్ కురుమ, మహిళా అధ్యక్షురాలు బండారు మంజుల, సోము బాలమణి కురుమ ,మోటే నరసింహ కురుమ, లతా గొరిగే, లలిత బట్టికిరి కుమార్ గొరిగే, మహేష్ కురుమ, బర్ల బాలరాజ్,అడ్వకేట్ సోము,బాలకృష్ణ,బచ్చారాము గొరిగే, శివాజీ కురుమ పాల్గొన్నారు.



ఉప్పల్ కురుమ సంఘం భవనం పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ రజిత పరమేశ్వరెడ్డి

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం చైర్మన్‌గా సత్యనారాయణ రెడ్డి ఎన్నిక

**సైదాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం నూతన పాలక మండలి చైర్మన్‌గా ఈదుల కంటి సత్యనారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ చంద్రశేఖర్, కార్యనిర్వాహణాధికారి లావణ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశంలో సత్యనారాయణ రెడ్డిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయశాఖ, దాతలు, ధర్మకర్తలు, భక్తుల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నూతన చైర్మన్‌గా ఎన్నికైన సత్యనారాయణ రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, పూల నాగరాజు, దిండు ప్రవీణ్ గౌడ్, తోకటి కిరణ్ కుమార్, సింగం శెట్టి శ్రీనివాస్, జనుంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ దుర్గారెడ్డి, కుకునూరి గోపాల్ రెడ్డి, కె.కవిత, ఒరుగంటి నరేష్, కొండ్ర సంతోష్ కుమార్, బండిగారి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన అర్చకులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఎస్. అంబాప్రసాద్‌లు పాల్గొన్నారు.



నూతన ధర్మకర్తలతో పాలకమండలి చైర్మన్ సత్యనారాయణ రెడ్డి

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి: అర్జున్‌రెడ్డి, సోమేశ్వర్

**సరూర్‌నగర్, జూన్ 7 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోదూరు సోమేశ్వర్‌లు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో కార్పొరేషన్ బిజెపి-2 అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ నేతల సమావేశం జరిగింది. గడచిన 11 సంవత్సరాల ప్రధాని మోడీ పాలనలో ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలతో పాటు వికసిత్ భారత్, అమృత కాలం, సేవ, సుపరిపాలన తదితర అంశాలపై చేయాల్సిన ప్రచారంపై చర్చించడానికి నిర్వహించిన ఈ సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడపగడపకి కేంద్ర పథకాలు, మోడీ సుపరిపాలనపై పార్టీ శ్రేణులు ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆవుల సత్తయ్య, కసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బచ్చనమోని కాశీరాం యాదవ్, జగన్ ముదిరాజ్, వలభోజు గోపినాథ్, సిద్దాల శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, తుమ్మల రమేష్ ముదిరాజ్, దామోదర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మెకం సుధాకర్ నేతలతో పాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బిజెపి నాయకులు

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి : కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు

**మేడిపల్లి ,జూన్ 7 ప్రభాతవార్త ;** పారిశుద్ధ్య కార్మిక సేవలు మరువలేనివని,వారు ఆరోగ్యంగా ఉంటేనే నగరపాలక సంస్థ పరిశుభ్రంగా ఉంటుందని పీర్జాదిగూడ నగరపాలక సంస్థ కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు అన్నారు.శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆదేశానుసారం ఏర్పాటైన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యుపిహెచ్సి పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతాపూర్,అభినవ్ కంటి హాస్పత్రి వారి ఆధ్వర్యంలో "హెల్త్ క్యాంప్" ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పారిశుద్ధ్య సిబ్బందికి క్రమం తప్పకుండా హెల్త్ క్యాంప్లు ఏర్పాటు చేస్తామని,అన్ని విభాగాల వైద్యులచే నిర్ధారణ పరీక్షలు చేసి దానికి అనుగుణంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.కార్మికులు ఆరోగ్యం,సంక్షేమం కోసం నగరపాలక సంస్థ కృషి చేస్తుందని, వారికి రావాల్సిన అన్ని సౌకర్యాల కల్పనకు, పిపిఈ కిట్స్ పంపిణీ చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇ.ఇ జి.సాయినాథ్ గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిశోర్ కుమార్, ఎస్ఐ ప్రవీణ్కుమార్, ఇన్విరాన్మెంటల్ ఇంజనీర్ జి. బాలమురళికృష్ణ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్జాదిగూడ హెల్త్ క్యాంపులో పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ త్రిల్లేశ్వరరావు

## ఆరోగ్యమే మహాభాగ్యం : కమిషనర్ శైలజా

**బోడుప్పల్, జూన్ 7 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండ్ మునిసిపల్ శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళిక లో భాగముగా నేడు 5 వ రోజు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం మేడ్చల్ జిల్లా ఆరోగ్య శాఖ అండ్ ఆర్. బి. ఎమ్. హాస్పిటల్ సహకారముతో ఎస్. ఆర్. డిజి స్కూల్ యందు మునిసిపల్ సిబ్బందికి,స్టాఫ్ కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగినది.ఇట్టి క్యాంప్ లో భాగముగా హెల్త్ ప్రొఫైల్ పుస్తకం అందచేయడం జరిగినది. ముఖ్యముగా క్యాన్సర్, టి. బి కి సంబందించిన పరీక్షలు నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... నగర పాలక సిబ్బంది,స్టాఫ్ అందరు 500 మంది ఇట్టి అవకాశమును ఉపయోగించుకొని అందరు పరీక్షలు చేయించుకోవాలని ప్రతి 3 నుండి 6 నెలల కు ఒకసారి వరకు ఒకసారి క్యాంప్ నిర్వహిస్తామని, అదే విధముగా ప్రతి ఒక్కరు డాక్టర్ ను సంప్రదించినప్పుడు విధిగా హెల్త్ ప్రొఫైల్ పుస్తకము వెంట తీసుకొని రావాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ శైలజ , జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఉమా గౌడ్, సత్యవతి, ఎస్. సి. డి. అధికారి మల్లీశ్వరి , ఆర్. బి. ఎమ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత ఆరోగ్య శిబిరంలో మాట్లాడుతున్న బోడుప్పల్ కమిషనర్ శైలజ

### వ్యర్థాల తొలగింపు ప్రక్రియను పరిశీలించిన డిసి



**అత్తాపూర్ జూన్6,ప్రభాతవార్త :** బక్రిద్ పండుగ సందర్భంగా పరిసరాలు శుభ్రంగా ఉండేలా తమ సిబ్బంది చర్యలు చేపట్టినట్లు రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు.శనివారం బక్రిద్ పండుగ దృష్ట్యా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఫోర్ట్ వ్యూ కాలనీ,ఎంఎం పహడీ,సూలేమన్ నగర్,చింతల్‌మెంట్ తదితర ప్రాంతాలలో ఇంటింటికి జంతు వ్యర్థాల సేకరింపు ప్రక్రియను డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ప్రతి ఒక్కరూ కూడా పరిసరాలు శుభ్రంగా ఉండేలా తమ సిబ్బందికి సహకరించాలని ఎవ్వరూ కూడా జంతు వ్యర్థాలను రోడ్లపై పడివేయరాదని సూచించారు. జివిపిల లో ఉన్న వ్యర్థాలను సిబ్బంది తొలగించారని ఇంటింటికి తిరిగి జంతు వ్యర్థాలను కూడా సేకరించారని సూచించారు.పరిసరాల శుభ్రత కోసం అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : కార్పొరేటర్ బన్నాల



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న కార్పోరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్

**నాచారం, జూన్ 7 ప్రభాతవార్త :** చిల్కానగర్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ చిల్కానగర్ డివిజన్లోని సాయిరాం నగర్ కాలనీ నివాసి కొల్లూరి సమ్మమ్మ కు వారి నివాసానికి వెళ్లి శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. అనంతరం కార్పొరేటర్ గీత ప్రవీణ్ సమ్మమ్మ,వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వారికి ఎటువంటి సహాయ సహకారాలు అవసరం ఉన్నా తనను సంప్రదించమని వారికి ధైర్యాన్ని చెప్పారు, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరమని అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఏదో ఒక రకంగా సహాయ పడుతున్నారని అదేవిధంగా సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధిత కుటుంబాలకి ఎక్కువ డబ్బులు అందేలా ప్రత్యేక చొరవ చూపుతున్నారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ,ఎద్దుల కొండల్ రెడ్డి కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్ , బాలకృష్ణ గౌడ్,శ్యామ్, బంటి గౌడ్ , పాల్గొన్నారు

## దివంగత అంపాల పద్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి



పద్మారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి

**నాచారం, జూన్ 7 ప్రభాతవార్త :** త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేన రెడ్డి నాచారంలో ఉన్న దివంగత బీజేపీ నాయకుడు అంపాలా పద్మా రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు పద్మా రెడ్డి పార్టీ విజయం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని, అప్పటి నుంచి తమకు పరిచయం ఉందని తెలిపారు. ఆయన మరణం బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు వై. సత్యనారాయణ రావు, రవి నాయక్, మర్రి మోహన్ రెడ్డి, బాలచందర్, డివిజన్ అధ్యక్షులు కొమ్మగల్ల నవీన్ కుమార్, రాగిరి మోహన్ రెడ్డి, మల్కా ప్రకాష్, రవికాంత్, ఉదయ్, కిరణ్, వెంకటేష్ గౌడ్, ఆనంద్, రవీందర్ రెడ్డి, బాలు, దయ గౌడ్, కృష్ణ, శేఖర్, వెంకటేష్, మంజు, జ్యోతి, లావణ్య, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## 12 నుంచి అలివేరుమంగ సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**ఎల్.బి.నగర్ జూన్ 7 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్ కాలనీలోని అలివేరుమంగ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ తెలియజేసింది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవాలయంలో ఆరు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాలలో భాగంగా హోమాలు, అభిషేకాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

## జైపూర్ కాలనీలో బడిబాట



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**ఎల్.బి.నగర్ జూన్ 7 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ జైపురి కాలనీ మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోని తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులను కల్పించడం జరిగిందన్నారు. ఉత్తమ విద్యా బోధన జరుగుతుందని, ఈ సంవత్సరం ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ ద్వారా వెనుక బడిన విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుటకు కృషి చేస్తున్నామని, ప్రైవేటు పాఠశాలకు పంపించి డబ్బులు వృథా చేసుకోరాదని మన బస్తీ లోని మన ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి కోరారు.కార్యక్రమంలో కాలనీ వాసులు సోమయ్య, పూర్వ అధ్యక్షులు రవికుమార్,ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీబ్యూల, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## డిసిసిబి మాజీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డికి మాతృ వియోగం

**సరూర్‌నగర్, జూన్ 7 ప్రభాతవార్త:** హైదరాబాద్-రంగారెడ్డి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) మాజీ ఛైర్మన్, బండ్లగూడ ఖాల్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డికి మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి సింగిరెడ్డి కిష్టమ్మ (87) తీవ్ర అస్వస్థతతో శుక్రవారం రాత్రి కన్నుమూశారు. దీంతో వారి స్వగ్రామం బాలాపూర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. పెంటారెడ్డి మాతృమూర్తి మృతి చెందారని తెలుసుకున్న హైదరాబాద్ నగర మాజీ మేయర్, హుడా మాజీ ఛైర్మన్, మహేశ్వరం మాజీ శాసనసభ్యుడు తీగల కృష్ణారెడ్డి శనివారం ఉదయం బాలాపూర్‌కు విచ్చేసి కిష్టమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన తల్లి మృతితో తీవ్ర విచారంలో ఉన్న పెంటారెడ్డిని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాలాపూర్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, బాలాపూర్ గ్రామస్తులు పెంటారెడ్డిని పరామర్శించారు. కిష్టమ్మ అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం బాలాపూర్ ప్రధాన స్మశానవాటికలో జరిగాయి.



విచారంలో ఉన్న సింగిరెడ్డి పెంటారెడ్డిని పరామర్శించిన తీగల కృష్ణారెడ్డి

## బడంగ్‌పేట్ రాళ్ళగూడెం సోదరులకు పితృ వియోగం

**సరూర్‌నగర్, జూన్ 7 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ రాళ్ళగూడెం బల్వంత్‌రెడ్డి, రాళ్ళగూడెం మల్లారెడ్డి, రాళ్ళగూడెం ఆయిల్‌రెడ్డిలకు పితృ వియోగం కలిగింది. వయో వృద్ధుడైన వారి తండ్రి, రైతు రాళ్ళగూడెం ముత్యంరెడ్డి (94) వృద్ధ్యాప్య అనారోగ్య కారణాలతో శనివారం ఉదయం మృతి చెందారు. ఈ నేపథ్యంలో బడంగ్‌పేట్ అన్నపూర్ణనగర్‌లోని రాళ్ళగూడెం వారి నివాసానికి పెద్ద ఎత్తు న తరలివచ్చిన గ్రామస్తులు, పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ముత్యంరెడ్డి భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించి రాళ్ళగూడెం సోదరులను పరామర్శించారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి బడంగ్‌పేట్‌కు వచ్చి ముత్యంరెడ్డికి నివాళులర్పించి ఆయన కుమారులను పరామర్శించారు. శనివారం సాయంత్రం బడంగ్‌పేట్ సర్వే నెంబర్ 153లోని స్మశానవాటికలో ముత్యంరెడ్డి అంత్యక్రియలు జరిగాయి.



రాళ్ళగూడెం ముత్యంరెడ్డికి నివాళులర్పిస్తున్న మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే: పక్కన ముత్యంరెడ్డి కుమారుడు మాజీ వార్డు మెంబర్ బల్వంత్‌రెడ్డి ఉన్నారు